ఆక్రమణల పర్వం.. రైతన్న దైన్యం


ఆక్రమణలకు గురవుతున్న వరకవిపూడి చెరువు


సాగునీరు అందకపోవడంతో బీళ్లుగా మారిన మాగాణి భూములు

వేల ఎకరాలకు సాగునీటిని అందించే చెరువు ఆక్రమణల చెరలో చిక్కుకుపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. కొందరి స్వార్థ ప్రయోజనాలకు వందల మంది రైతులు సాగుకు దూరమవుతున్నారు. వందల ఎకరాల మాగాణి పొలాలకు వరకవిపూడి చెరువు నుంచి నీరు అందకపోవడంతో బీడుగా మారిపోతున్నాయి. అధికారులు చర్యలు తీసుకుని చెరువును కాపాడాలని రైతన్నలు కోరుతున్నారు.

కుచించుకుపోయిన వరకవిపూడి చెరువు
- వందల ఎకరాలకు అందని సాగునీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

తోటపల్లిగూడూరు : మండలంలోని వరకవిపూడి చెరువులో ఆక్రమణల పర్వం జోరందుకుంది. దీంతో చెరువు నీటినే ఆధారంగా చేసుకొని సాగు చేస్తున్న ఆయకట్టుదారులు ఆందోళనలో పడిపోయారు. దాదాపు 750 ఎకరాల విస్తీర్ణంతో వరకవిపూడి చెరువు మండలంలోనే రెండో అతిపెద్ద చెరువుగా ఉంది. ఈ చెరువు ఆయకట్టు కింద వరకవిపూడి పంచాయతీలోని శివరామపురం, కుమ్మరిపాళెం, అనంతపురం, మిట్టపాళెంతో పాటు మండపం పంచాయతీలోని గొల్లపాళెం, పైనాపురం పంచాయతీలోని 1,200 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే 750 ఎకరాల్లో ఉన్న ఈ చెరువు నానాటికీ ఆక్రమణలకు గురవుతూ ప్రస్తుతం 500 ఎకరాల విస్తీర్ణానికి తగ్గిపోయింది.

ఐదో నంబర్ తూము కింద దిగజారిన ఆయకట్టు

వరకవిపూడి చెరువు కింద ఆరు తూముల ద్వారా కిందనున్న ఆయకట్టు పొలాలకు సాగునీరు అందుతోంది. ఇందులో ముఖ్యమైనది ఐదో నంబర్ తూము. ఈ తూము కింద వరకవిపూడి, అనంతపురం, కుమ్మరిపాళెం, పైనాపురం గ్రామాలకు సంబంధించి దాదాపు 600 ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. అయితే చెరువులో భారీగా సాగుతున్న ఆక్రమణలు, తగ్గిపోతున్న నీటి సామర్థ్యం వెరసి ఈ తూము కింద ఆయకట్టు గణనీయంగా దిగజారిపోయింది. సాగునీరు సక్రమంగా పారకపోవడంతో గత ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి ఈ తూము కింద ఉన్న 600 ఎకరాలకు గానూ 180 ఎకరాలకు మించి రైతులు సాగు చేపట్టలేకపోయారు. మిగిలిన పొలాలు బీడుగా మారిపోయాయి. దీనికి ప్రధాన కారణాలు తగ్గిన సాగునీటి సామర్థ్యం, చెరువులో భూ ఆక్రమణలే. అయితే ఈ చెరువు ఆక్రమణల విషయంలో అధిక శాతం పేదలే ఉండడంతో అటు ఇరిగేషన్ అధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకున్నారు. కానీ ఈ చెరువు నీటినే ఆధారంగా పంటలను పండించుకొంటున్న వరకవిపూడి, అనంతపురం, కుమ్మరిపాళెం, పైనాపురం రైతులు తమ పంట పొలాలను బీళ్లుగా మార్చుకొనే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి.


కుచించుకుపోయిన ఐదో నంబర్ తూము


చెరువును ఆక్రమించుకుని రైతులు సాగు చేస్తున్న పొలాలు

సాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి



1200 ఎకరాల మాగాణి పొలాలకు సాగు నీటిని అందించే సామర్థ్యం ఉన్న వరకవిపూడి చెరువు నేడు 500 ఎకరాలకు మించి సాగునీరు అందించలేకుంది. దీనికి కారణం చెరువు ఆక్రమణలకు గురికావడమే. చెరువు ఆక్రమణలకు అరికట్టకపోతే మాగాణి పొలాలను ఎండపెట్టుకోక తప్పదు. అధికారులు స్పందించి ఇకనైనా మిగిలిన చెరువు ఆక్రమణలకు గురికాకుండా చూడాలి.

– కూరపాటి కృష్ణారెడ్డి, స్థానిక రైతు

క్లుప్తంగా

ప్రసన్న పరామర్శ



ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామానికి చెందిన పంబాల చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం గంగపట్నం గ్రామానికి విచ్చేసి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, కొండూరు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవూరులో..


తిరుపతిరెడ్డికి నివాళులర్పిస్తున్న ప్రసన్న

కోవూరు : కోవూరుకు చెందిన ఇలుపూరి వెంకటశేషమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. ఈ క్రమంలో వారి కుటుంబసభ్యులను ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అదేవిధంగా గంగవరంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత యేడెం తిరుపతిరెడ్డి ఇటీవల మృతిచెందారు. ఆయన ఉత్తరక్రియల్లో ప్రసన్న పాల్గొని నివాళులర్పించారు. ఆయన వెంట దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, తాటిపర్తి విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పిడూరుపాళెంలో గ్రామసభ

మనుబోలు : మండలంలోని పిడూరుపాళెం గ్రామంలో రీసర్వే సమస్యలపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ సుబ్బయ్య రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతులు అర్జీల రూపంలో తమ సమస్యలను తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, రీసర్వే డీటీ మంజుల, వీఆర్వో సురేంద్ర, సర్వేయర్ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పాటూరులో..

కోవూరు : మండలంలోని పాటూరు పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో రీసర్వేకు సంబంధించి గ్రామసభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నిర్మలానందబాబా రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్, సర్వేయర్ రమేష్‌గౌడ్ ఉన్నారు.

భూ ప్రకంపనలపై పరిశోధన


పరిశోధన చేసిన విద్యార్థినులను అభినందిస్తున్న చైర్మన్ గుణశేఖర్

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఎంసీఏ విద్యార్థులు లిఖిత, సుస్మిత, జాహ్నవి 'అర్లియర్ డిటెక్షన్ ఆఫ్ ఎర్త్ క్వేక్ ఎస్టిమేషన్ ఆఫ్ జియోగ్రాఫిక్ లొకేషన్స్ యూజింగ్ న్యూరల్ నెట్‌వర్క్'పై పరిశోధన చేశారు. ఈ పరిశోధనా పత్రాలను 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్రియేటివ్ రీసెర్చ్ థాట్స్' సంస్థకు సమర్పించారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా ముందస్తు భూ ప్రకంపనల అంచనాపై పరిశోధన చేసిన విద్యార్థినులను కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ ఆ కళాశాలలో బుధవారం ప్రత్యేకంగా అభినందించి కొనియాడారు. రీసెర్చ్ డెవలప్‌మెంట్ డీన్ వెంకట నాగేంద్ర, ఎంసీఏ విభాగాధిపతి రాజశేఖర్, అధ్యాపకులు దీప్తి, మస్తాన్ పాల్గొన్నారు.

జేసీ పరిశీలన

ఇందుకూరుపేట : మండలంలోని లేబూరు గ్రామంలో జేసీ కార్తీక్ బుధవారం పర్యటించారు. ఓ ప్రభుత్వ భూమిని తనకు విక్రయించాలని గ్రామానికి చెందిన ఓ రైతు దరఖాస్తు చేసుకుని ఉన్నారు. ఈ నేపథ్యంలో జేసీ గ్రామానికి విచ్చేసి ఆ భూమిని పరిశీలించారు. కాగా ఆ భూమి గ్రామ అవసరాలకు, పేదల నివేశన స్థలాలకు ఉపయోగపడుతోందని, ఆ దిశగా పరిశీలించాలని గ్రామస్తులు కోరారు. డీటీ మురళీ, మండల సర్వేయర్ హరనాథ్, ఆర్‌ఐ విద్యాసాగర్, వీఆర్వో పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

బుచ్చిరెడ్డిపాళెం : గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై క్షేత్ర సహాయకులతో ఎంపీడీఓ శ్రీహరి బుచ్చిరెడ్డిపాళెంలోని తన కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలన్నారు. దొంగ మస్తర్లు వేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులకు కూలీల సంఖ్య పెంచాలని క్షేత్ర సహాయకులను సూచించారు.

మండల సర్వసభ్య సమావేశం 26న

ముత్తుకూరు : ముత్తుకూరు మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 26వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం జరిగే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థిని


బి.శ్రావణి

వెంకటాచలం : చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలకు మండలంలోని గొలగమూడి వద్దనున్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీకామేశ్వరి, పీడీ షేక్.షబిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదువుతున్న బి.శ్రావణి జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు వివరించారు.

ఫైర్ స్టేషన్‌కు స్థల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి, అగ్నిమాపక శాఖాధికారులు బుధవారం స్థలాన్ని పరిశీలించారు. బుచ్చిరెడ్డిపాళెంలో మలిదేవి కాలువ పక్కనే ఉన్న డంపింగ్ యార్డును వారు తనిఖీ చేశారు. ఈ డంపింగ్ యార్డులో 30 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఫైర్ స్టేషన్‌ను నిర్మించేందుకు నిధులు విడుదలై టెండర్లను కూడా పిలిచినట్లు వారు పేర్కొన్నారు. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలియజేశారు. వారి వెంట మండలాధికారులు, సర్వేయర్లు తదితరులు ఉన్నారు.

మండలాభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం

- డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు


బదిలీపై వెళ్లిన ఎంపీడీఓను సన్మానిస్తున్న చలపతిరావు

కొడవలూరు : మండలాభివృద్ధిలో అధికారుల పాత్ర ఎంతో కీలకమని, అందుకే బదిలీపై వెళ్లిన అధికారులను సన్మానిస్తూ గౌరవించడం మంచి సాంప్రదాయమని డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ వి.డేవిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్, సూపరింటెండెంట్ సురేష్‌రెడ్డి, పలువురు పంచాయతీ కార్యదర్శులను ఎంపీపీ గాలి జ్యోతి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చలపతిరావు హాజరై, మాట్లాడారు. మండలంలో అధికారులుగా పనిచేసిన సమయంలో వారు అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. ఎంపీపీ జ్యోతి మాట్లాడుతూ బదిలీ అయిన వారిని సన్మానించడం ద్వారా వారందించిన సేవలకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ.సుబ్బారావు, ఈఓపీఆర్డీ సాయిప్రసాద్, సర్పంచ్‌లు మారంరెడ్డి రంగారెడ్డి, బి.సుప్రియ, మోర్ల రమేష్, వల్పాపురం నవీన్, ఎంపీటీసీ సభ్యులు కామేశ్వరి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పనులు చేయకుండానే వేతనాలు పక్కదారి

- గ్రామాల్లో కనిపించని వైద్య సిబ్బంది
- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల ధ్వజం

కొడవలూరు : ఉపాధి కూలీలు పని చేయకుండానే మస్తర్‌లు వేసేసి వేతనాలను పక్కదారి పట్టిస్తున్నారని ఆలూరుపాడు సర్పంచ్ మోర్ల రమేష్ ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు అధికారుల వైఫల్యాలను ఎండగట్టారు. సర్పంచ్ నల్లావుల శ్రీనివాసులు మాట్లాడుతూ రేగడిచెలిక, పెయ్యలపాళెం గ్రామాల్లో ఎంతో మంది జ్వరాల బారిన పడుతుంటే వైద్య సిబ్బంది కనుచూపు మేర కనిపించడం లేదన్నారు. రాచర్లపాడు దళితవాడలో 11 కేవీ వైరు నివాసాలకు వెళ్లే వైర్లపై పడుతుండడంతో ఇంట్లోని గృహోపకరణాలు కాలిపోతున్నాయని, ఆ ప్రాంతంలో ఓ స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు అభివృద్ధి పనుల్లో సర్పంచ్‌లకు సహకరించకపోవడం వల్ల అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సుబ్బారావు, ఎంపీపీ జ్యోతి, ఈఓపీఆర్డీ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులపై దృష్టిపెట్టాలి


వెంకటాచలం: సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాసులు


కొడవలూరు : అవగాహన కల్పిస్తున్న ఏఓ లక్ష్మి

వెంకటాచలం : రైతులు ఆధునిక సాగు పద్ధతులపై దృష్టి సారించాలని ఏడీఏ శ్రీనివాసులు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెముడుగుంట, కాకుటూరు గ్రామాల్లో వ్యవసాయాధికారులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాకుటూరు రైతులకు సబ్సిడీపై బీపీటీ 5204, కేఎల్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 తదితర రకాల వరి విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని కోరారు. ఏఓ హరి కరుణాకర్‌రెడ్డి, ఏఈఓలు షేక్.రిజ్వానా, ఎస్.జాహ్నవి పాల్గొన్నారు.

- **తోటపల్లిగూడూరు :** మండలంలోని పేడూరు, నరుకూరు సచివాలయాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శిరీషారాణి రానున్న రబీ సీజన్‌కు సంబంధించి సాగు పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక పంట పొలాల్లో క్షేత్ర సందర్శన చేపట్టారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. నరుకూరు ఎంపీటీసీ కొణతం రఘుబాబు, ఏఈఓ హరిబాబు, వీఏఏ నిరూష పాల్గొన్నారు.
- **కొడవలూరు :** విత్తనాల కొనుగోలు సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. వరి విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు బిల్లులు, బ్యాగులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. విత్తనాల్లో లోపం ఉంటే విక్రయదారులపై చర్యలకు వాటి అవసరం ఉంటుందన్నారు. జేవీఓ రాజశేఖర్ పశువులకు వేయాల్సిన టీకాలు, పాడి రైతులకు అందిస్తున్న పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓ ఎ.అనూష, వీఏఏ డి.శివజ్ఞాన, వీఆర్వో మల్లికార్జున పాల్గొన్నారు.
- **ఇందుకూరుపేట :** మట్టి నమూనాల ఫలితాల ఆధారంగా పంటలను వేసుకోవాలని ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముదివర్తిపాళెం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. సబ్సిడీపై వరి విత్తనాలను అందిస్తున్నామన్నారు. ఏఓ రఘునాథ్‌రెడ్డి, వీఏఏ శ్రీకాంత్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం

మనుబోలు : మండల పరిధిలోని చెరుకుమూడి, బండేపల్లి రెవెన్యూ పరిధిలో జరిగిన రీసర్వేలో పలు అవకతవకలు జరిగిన విషయం వాస్తవమేనని, అందుకు కారకులైన అధికారులపై చర్యలు చేపడుతామని జేసీ కార్తీక్, ఆర్డీఓ అనూష తెలిపారు. చెరుకుమూడి, బండేపల్లి రెవెన్యూ పరిధిలో జరిగిన రీసర్వేలో అవకతవకలు జరిగాయని కలెక్టరేట్‌కు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో బుధవారం వారు ఆయా గ్రామాల్లోని సంబంధిత భూములను పరిశీలించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పూర్తిస్థాయిలో విచారణ జరిపి సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ సుబ్బయ్య ఉన్నారు.

కాకాణిపై ఫిర్యాదు

ముత్తుకూరు : ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై మండల టీడీపీ నాయకులు బుధవారం ఫిర్యాదు చేశారు. టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయంటూ కొద్దిరోజులుగా కాకాణి ప్రశ్నలు గుప్పిస్తున్నారు. దీనిని సహించలేని స్థితిలో సోమిరెడ్డి తనపై కేసులు బనాయిస్తున్నారని కాకాణి మండిపడ్డారు. కేసులు, అరెస్టులకు భయపడేది లేదంటూ ధీమా వ్యక్తం చేశారు.

దాతల సహకారం ప్రశంసనీయం


యల్లాయపాళెం హైస్కూల్‌లో సైకిల్ స్టాండ్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ రామారావు

కొడవలూరు : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలందిస్తున్న సహకారం ప్రశంసనీయమని డీఈఓ పీవీజే రామారావు కొనియాడారు. మండలంలోని యల్లాయపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బండ్ల బంగారయ్య, కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బండ్ల హరిప్రసాద్(యూఎస్ఏ) సొంత నిధులతో సైకిల్ స్టాండ్‌ను నిర్మించారు. దీనిని బుధవారం డీఈఓ ప్రారంభించి, మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకోవడం అందరి బాధ్యత అన్నారు. యల్లాయపాళెం ఉన్నత పాఠశాలకు హరిప్రసాద్‌తో పాటు గతంలో ఎంతో మంది దాతలు సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు జి.వసంత కుమారి, ఎస్.అంకయ్య, పాఠశాల హెచ్ఎం ఎ.మోహన రామలింగయ్య, స్థానిక నాయకుడు కట్టా ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.తిరుమలయ్య, మల్లికాదేవి, రంగారావు, పుష్పకళ, సుజాత, గాయత్రి, పీడీ వెంకటేశ్వర్లు, సీఆర్ఎంటీ ఎం.దయాకర్, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం : ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చదువుతో పాటు సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంపునకు వర్సిటీ స్థాయి ఎంపికలు బుధవారం జరిగాయి. ఎన్ఎస్ఎస్ వలంటీర్ల హైట్, రన్నింగ్, పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ ఆధారంగా ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మాట్లాడుతూ గత రెండేళ్లలో రెండు రాష్ట్రపతి అవార్డులు, నాలుగు రాష్ట్రస్థాయి అవార్డులు విశ్వవిద్యాలయానికి వరించడం ఎంతో గర్వకారణమని తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాబోయే రోజుల్లో సామాజిక కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొని వీఎస్‌యూకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, టి.భారతి, దివ్య పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీడీ నాగమణి

ముత్తుకూరు : మండలంలోని మల్లూరులో బుధవారం జరిగిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పశు గణాభివృద్ధి సంస్థ–రాష్ట్రీయ గోకుల్ మిషన్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని వెటర్నరీ నెల్లూరు డీడీ డాక్టర్ నాగమణి ప్రారంభించారు. ఈ శిబిరంలో 131 పశువులకు వైద్య పరీక్షలు చేసి, మందులను అందజేశారు. డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ వసంతరాయలు, ముత్తుకూరు ఏడీ డాక్టర్ నిర్మల, డాక్టర్ రాజ్యలక్ష్మి, శంకరరెడ్డి, శివతేజారెడ్డి, ట్రైనీ డాక్టర్‌లు పాల్గొన్నారు.

చెన్నపల్లిపాళెం విద్యార్థుల ప్రతిభ


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

తోటపల్లిగూడూరు : మండలంలోని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్స్, కరాటే, వాలీబాల్, క్రికెట్ జట్లకు జిల్లాస్థాయి ఎంపికలు జరిగాయి. వీటిలో పాఠశాలకు చెందిన సందీప్, ముఖేష్, శశాంక్, సాయి, లిల్లీ, వేణుగోపాల్ మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్లకు ఎంపికయ్యారు. వీరు త్వరలో వివిధ జిల్లాల్లో జరుగనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారు. ఈ క్రమంలో వీరిని బుధవారం పాఠశాల హెచ్ఎం సాయిప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ నాగరాజు, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు ఫణికుమార్ అభినందించారు.